క్లుప్తంగా

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అప్పారావు

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. వల్లంపూడిలో శుక్రవారం రైతులకు సాగులో మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఉప సర్పంచ్ రుద్రవెంకటరావు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందన్నారు. 18 రకాల విత్తనాల 12 కేజీల కిట్ రైతు సేవా కేంద్రాల్లో రూ.800లకే అందజేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రం వీఏఏ రమేష్, పవన్, రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ ఆధార్ సేవలు

బొండపల్లి: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గజపతినగరం పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ బోద్దల ఉపేంద్ర అన్నారు. మండలంలోని ఒంపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులతో పాటు కొత్త ఆధార్ కార్డు కావాల్సిన వారు, పేర్లు తప్పుగా నమోదు అయిన వారు తమ వివరాలను మార్పు చేసుకోనే విధంగా అన్ని సేవలను కేంద్రంలో రెండు రోజులు పాటు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన వారే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన వారు కూడా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణ దరఖాస్తుల పరిశీలన

గంట్యాడ: బీసీ సంక్షేమ శాఖ స్వయం ఉపాధి పథకాల కింద రుణాలు పొందేందుకు మండలంలోని పలువురు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. కొరాటుబిల్లి, గంట్యాడ, నరవ, రామవరం, నీలావతి సచివాలయాల్లో దరఖాస్తులను అధికారులు పరిశీలించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. పరిశీలనలో అర్హత కల్గిన లబ్ధిదారులను గుర్తించి తదుపరి బ్యాంకు ప్రక్రియ కోసం సంబంధిత బ్యాంకులకు పంపించనున్నామని ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి తెలిపారు.

ఎంఆర్‌సీ భవనానికి మరమ్మతులు



ఎంఆర్‌సీ భవనంపై ఫ్లోరింగ్ పనులు

వేపాడ: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం మరమ్మతులకు మండల పరిషత్ నిధులు రూ.5లక్షల మంజూరు కాగా.. చేపట్టిన పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఎంపీపీ సత్యవంతుడు మండల పరిషత్ నిధులు కేటాయింపులో తన వంతు కృషి చేశారు. దీంతో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీతో పాటు శ్లాబ్‌పై ఫ్లోరింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

వేలం పాట ఖరారు



వేలం పాటలో పాల్గొన్న అధికారులు, పాటదారులు

గజపతినగరం : మండల కేంద్రంలోని పురిటిపెంట పంచాయతీ రోజువారి ఆశీల వేలం పాట రూ.2లక్షల 20వేల వందకు ఖరారైనట్టు ఈఓపీఆర్‌డీ కె.సుగుణాకరరావు తెలిపారు. పురిటిపెంట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో ఆరుగురు వేలం పాటలో పాల్గొన్నారు. వీరిలో సాసుబిల్లి అప్పలనాయుడు అధిక మొత్తానికి పాట పాడి దక్కించుకున్నాడు. పాటలో సర్పంచ్ నవర కొండమ్మ, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గజపతినగరం పంచాయతీ పరిధిలో రోజువారి ఆశీల వేలం పాటను ప్రభుత్వం నిర్దేశించిన రెండు లక్షల ఒక వెయ్యి రూపాయలకు బూర్లి లక్ష్మి దక్కించుకున్నట్టు పంచాయతీ ఈఓ జనార్దనరావు తెలిపారు.

ఏప్రిల్ 1న ఇంటర్వ్యూలు

వేపాడ: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 1వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు తాము చేసుకున్న దరఖాస్తుతో పాటు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 480 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

అమ్మ పండగకు అంతా సిద్ధం

శృంగవరపుకోట: భక్తుల కొంగు బంగారం నూకాలమ్మ అమ్మవారి పండగ కోసం అంతా సిద్ధమైంది. నూకాలమ్మ వారు శుక్రవారం సాయంత్రం పట్టణంలో మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ సంబరంగా ముందుకు సాగింది. కొత్త అమావాస్య వేళ గ్రామాల్లో భక్తుల పూజలు అందుకునేందుకు నూకాలమ్మ సిద్ధం అవుతుండగా.. గ్రామాల్లోని ప్రజలు అమావాస్య వేళ అమ్మ పూజల కోసం సిద్ధం అవుతున్నారు.

అమ్మవారి ఘటాలతో..

ఎస్.కోట పట్టణంలో నూకాలమ్మ పండగ ఏటా మాదిరిగానే అనువంశిక పూజారి మళ్ల గణేష్ ఇంటి నుంచి సాయంత్రం ఏడు గంటలకు అమ్మవారి చల్ల ఘటంతో ఆడంబరంగా ముందుకు సాగింది. అమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా పట్టణ వీధుల గుండా మోదుచింతచెట్ల వద్ద ఉన్న నూకాలమ్మ గుడి వద్దకు తీసుకువెళ్లారు. పట్టాపోతు, అరటి గెలలు, పసుపు – కుంకుమల కావెళ్లు, పిండి వంటలు, చీర సారెలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారి ఘటంతో సాగుతున్న అనువంశిక ధర్మకర్త గణేష్ తదితరులు



నూకాలమ్మ వెంట సాగుతున్న శక్తి వేషాలు



నూకాలమ్మ సంబరంలో కోలాటం ఆడుతున్న మహిళలు

కార్మికులకు అండగా వైఎస్సార్ టీయూసీ



అరకు-విశాఖ రోడ్డులో బైక్ ర్యాలీ

కొత్తవలస : కార్మిక సమస్యలపై పోరాడుతూ వారికి అండగా వైఎస్సార్ టీయూసీ ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగంపల్లి గణేష్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ టీయూసీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గణేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం వద్ద ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా తన నియామకంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రిక్షా, ఆటో, కర్మాగారం తదితర రంగాల్లో ఉన్న కార్మికులకు అండగా తమ సంఘం ఉంటుందన్నారు. కూటమి పాలనలో జిల్లాలో అనేక పరిశ్రమలు మూత పడ్డాయన్నారు. ముఖ్యంగా కొత్తవలస మండలంలో జూట్ మిల్లులు మూతపడ్డాయన్నారు. జిందాల్ కర్మాగారం మూతపడగా వైఎస్సార్‌సీపీ నాయకుడు నెక్కల నాయుడుబాబు చొరవతో పునఃప్రారంభించారని తెలిపారు.

బైక్ ర్యాలీ

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గణేష్ జిందాల్ కర్మాగారం నుంచి అరకు – విశాఖ రోడ్డులో పలువురు కార్మికులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్తవలస జంక్షన్ వరకు సుమారు ఆరు కిలోమీటర్లు ర్యాలీ చేసి కొత్తవలస జంక్షన్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిందాల్ కర్మాగార వైఎస్సార్ టీయూసీ సంఘం జనరల్ సెక్రటరీ పప్పల బంగారనాయుడు, సెక్రటరీ జె.శ్రీనివాసరావు, టి.రామస్వామి, పి.వెంకటేశ్వర్లు, ఉత్తరాపల్లి ఎంపీటీసీ సభ్యుడు మూనూరు శివప్రసాద్, చిన్నిపాలెం మాజీ సర్పంచ్ పావాడ దాలయ్య, పలువురు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొత్తవలస జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గణేష్ తదితరులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్ల: మండలంలోని గుర్ల సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలైన కెల్ల, మన్యపురిపేట, సొలిపిసోమరాజు పేట, బెల్లాన పేట, గుర్ల, అచ్యుతపురం, పాలవలస, తెట్టంగి, కోటగండ్రేడు, పెనుబర్తి, నక్కలపేట, గుజ్జింగివలస, పెనుబర్తి, గూడేం. పున్నపురెడ్డి పేట, చింతపల్లిపేట, పాలాయవలస, పల్లిగండ్రేడు గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ నారమం నాయుడు శుక్రవారం తెలిపారు. గుర్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఇంటర్వ్యూలు

గుర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శేషుబాబు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ఆన్‌లైన్ దరఖాస్తు పత్రం, డిగ్రీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. మండలంలోని 42 గ్రామాల నుంచి 517 మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. వీరిలో అర్హత ఉన్న 102 మందికి రుణాలు మంజూరు చేస్తామని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

నేడు సమావేశం

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల ప్రత్యేకాధికారి పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు విధిగా వివరాలతో హాజరు కావాలని కోరారు.

5న మండల సమావేశం

మెరకముడిదాం: మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 5న ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖ వివరాలతో హాజరు కావాలని సూచించారు.

సులభతర బోధనతో సత్ఫలితాలు

గజపతినగరం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఉపాధ్యాయులు సులభతరమైన రీతిలో బోధన చేసి సత్ఫలితాలు సాధించాలని ఎంఈఓ విమలమ్మ అన్నారు. పురిటిపెంట ఎస్సీ కాలనీ పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. పిల్లల రోజువారి హాజరు పట్టికను చూశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండీఎం రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు పిల్లలకు మంచిగా బోధించి మంచి ఫలితాలు సాధించాలని కోరారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ విమలమ్మ

తప్పులు చేస్తే చర్యలు తప్పవు

- ప్రజావేదికలో ఏపీడీ
- పనులు చేయని వారికి మస్తర్లు
- మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం

దత్తిరాజేరు: ఉపాధి హామీ పనుల్లో తప్పులు దొర్లితే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవని ఏపీడీ పద్మజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన 2 కోట్ల 96 లక్షల 49 వేల 275 రూపాయిల పనులకు సంబంధించి ప్రజా వేదిక శుక్రవారం నిర్వహించారు. గ్రామాల వారీగా డీఆర్‌పీలు చేసిన తనిఖీల్లో దొర్లిన తప్పులను చదివి వినిపించారు. చాలా గ్రామాల్లో పని ప్రదేశం వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని, పనికి రాకుండానే మస్తర్లు వేశారని తెలిపారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించడం వల్ల చాలా గ్రామాల్లో నాటిన మొక్కలు లేవని చెప్పారు. ప్రతి శుక్రవారం ఉపాధి వేతనదారులకు నిర్వహించాల్సిన రోజ్‌గార్ దివాస్ కార్యక్రమాన్ని క్షేత్ర సహాయకులు నిర్వహించడం లేదని వెల్లడించారు. మండలంలో 35 పంచాయతీల్లో ఉన్న క్షేత్ర సహాయకులు రెండు చెరువులు లేదా కోనేరుల వద్ద కొబ్బరి మొక్కలు నాటించాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు సూచించారు. ఏటా జరుగుతున్న ప్రజా వేదికలో ఎక్కువగా మొక్కలు లేవనే చదవడం తప్ప వాటిని ఎలా పెంచాలనే దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. నీడనిచ్చే మొక్కలతో పాటు కొబ్బరి మొక్కలు పెంచడం వల్ల పంచాయతీలకు ఆదాయం రావడంతో పాటు భావితరాల వారికి ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రజా వేదికలో రాజాం ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఓ వెంకటప్పలనాయుడు, ఎస్ఆర్‌పీ మన్మధరావు, ఏఓ శివాజీ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌పీ చెబుతున్న ఆడిట్ వివరాలను వింటున్న ఏపీడీ పద్మజ, ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు

తీరు మారకుంటే మీరు మారుతారు...తస్మాత్...!

- ప్రజా వేదికలో మండిపడ్డ ఏపీడీ



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: ఉపాధి పనుల కల్పనలో సిబ్బంది పనితీరు మారకుంటే వారే మారిపోతారని ఏపీడీ రమామణి హెచ్చరించారు. స్థానిక స్త్రీశక్తి భవన ప్రాంగణంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు తమ నివేదికలు వినిపించారు. పలు గ్రామాల్లో వంద రోజుల పనులు కల్పించలేదని వారు వెల్లడించారు. 10,282 మంది వేతనదారులు ఉండగా వీరిలో 1890 మందికి మాత్రమే వంద రోజులు పనులు కల్పించినట్టు చెప్పగా ఏపీడీ విస్మయం వ్యక్తం చేశారు. దీన్ని బట్టి ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు అర్థం అవుతోందన్నారు. మస్తర్లలో తప్పులు చేస్తే సహించే పరిస్థితి లేదన్నారు. విధులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీరు మారని 73 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని ఆమె చెప్పారు. మస్తర్లు లేని చెల్లింపులు, దిద్దుబాట్లు, చెల్లింపుల్లో తేడాలు ఉన్నట్టు వివరించారు. దీంతో కొందరు క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించారు. ప్రజా వేదికలో ఎంపీపీ సోమేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్లీజ్... ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని బొండపల్లి మండలంలోని అంబటివలస గ్రామ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులతో పాటు ప్రజాప్రతినిధులు శుక్రవారం ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను అభ్యర్థించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సేవలను వివరించారు. సర్పంచ్ పాలూరి రామునాయుడు, ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, హెచ్ఎం ఆనంద్, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, రౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు. – బొండపల్లి

విద్యుత్ చార్జీలపై ప్రజాగ్రహం



పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని కోరుతూ సీపీఎం డివిజన్ కార్యదర్శి అంబళ్ల గౌరునాయుడు ఆధ్వర్యంలో చీపురుపల్లిలో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఎదుట పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను తగులబెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలోనే విద్యుత్ చార్జీల భారం మోయలేనంతగా పెరిగాయన్నారు. తక్షణమే పెంచిన చార్జీలను తగ్గించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం

బొండపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో విఫలమైందని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాకోటి రాములు, తొత్తడి పైడిపునాయుడు విమర్శించారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఏప్రిల్ 1వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి వేతనదారులకు 80 రోజులుగా వేతన బకాయిలు చెల్లించ లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు.



జెడ్పీ హైస్కూల్‌లో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

బీసీ రుణాల కోసం 362 దరఖాస్తులు

దత్తిరాజేరు: బీసీ రుణాల కోసం మండల వ్యాప్తంగా 35 పంచాయతీల నుంచి ఆన్‌లైన్‌లో 362 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. త్వరలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

108 శివలింగాలకు రుద్రాభిషేకం

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల ఓం సదనం ఆశ్రమంలో పాల్గుణ మాస మాస శివరాత్రి సందర్భంగా 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని పీఠం వ్యవస్థాపకులు అంపోల ఉమామహేశ్వరరావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగాలకు బిల్వార్చన, పుష్పార్చన తదితర పూజలను నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.



108 శివలింగాలకు మహారుద్రాభిషేకాలు

యువకుడి ఆత్మహత్యా యత్నం

దత్తిరాజేరు: మండల కేంద్రం సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం సాయంత్రం ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడడంతో స్థానికులు గుర్తించి పక్కనే ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గజపతినగరం సామాజిక ఆస్పత్రికి, అక్కడ నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి 108లో తరలించినట్టు ఈఎంటీ నరేంద్ర మహపాత్రో చెప్పారు. యువకుడు పేరు వినోద్ అని స్వస్థలం సీతానగరం మండలం లక్ష్మీపురం అని వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చొక్కాకుల

లక్కవరపుకోట : కూటమి ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి గనివాడ గ్రామానికి చెందిన చొక్కాకుల మల్లునాయుడుని వరించింది. మల్లునాయుడును పలువురు అభినందించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

కొత్తవలస : మండల కేంద్రంలో విశాఖపట్నం రోడ్డులో గల దుర్గాదేవి ఆలయంలో కొత్తవలస జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ సముద్రాల విజయచంద్ర శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పూజారి వి.లక్ష్మిశ్రీనివాసరావుశర్మ మంత్రోచ్చరణ మధ్య క్రోధనామ సంవత్సరం చివరి రోజును పురష్కరించుకొని మాస శివరాత్రి సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న కొత్తవలస కోర్టు జడ్జి విజయచంద్ర

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



ఇప్పలవలసలో సంకల్పంలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

మెరకముడిదాం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చీపురుపల్లి సీఐ జి.శంకర్రావు అన్నారు. మండలంలోని ఇప్పలవలస గ్రామంలో సంకల్పం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమింగ్‌లు, బెట్టింగ్‌లతో జీవితాలు తారుమారవుతున్నాయని ఇలాంటి వాటితో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ద్విచక్ర వాహనాలను నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించడం, కార్లు నడిపేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవడం వంటివి తప్పనిసరిగా చేయాలన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఎస్ఐ జె.లోకేశ్వరరావు పాల్గొన్నారు.